క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల క్యాలెండర్‌ను సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఎస్ఏ బషీర్, బంకా వాసుబాబు, రేపూడి చిన పిచ్చయ్య, బొర్రా వెంకటరావు, నరసింహారావు, వెంకటేశ్వరరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, తోకల అచ్చయ్య తదితరులు ఉన్నారు.

యువత సన్మార్గంలో నడిచేలా ప్రేరణ కలిగించాలి



సత్తెనపల్లి: యువత సన్మార్గంలో నడిచే విధంగా ప్రేరణను కలిగించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్ర మేనేజర్ కిరణ్మయి దేవిరెడ్డి పేర్కొన్నారు. గుంటూరులో ఆమెను హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంచర్ల బుల్లిబాబు, మంగళగిరికి చెందిన విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాగితాల స్వాతి గౌడ్‌తో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆమెకు మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా కిరణ్మయి దేవి రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలో యువ సంపద ఎక్కువగా ఉందని, యువత లక్ష్యం కోసం, భారతదేశం కోసం పాటుపడే విధంగా రోడ్డు భద్రత వారోత్సవాలు, మాదక ద్రవ్యాల నివారణ, ఓటు విలువ, విపత్తు పరిణామాలను ఎదుర్కొనే విధానం పై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ వలంటీర్ షేక్.షరీఫ్ ఉన్నారు.

మాదలలో ఫ్యామిలీ డాక్టర్

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఫ్యామిలీ పిజీషియన్ కార్యక్రమం శనివారం జరిగింది. వైద్యులు జయకృష్ణ, వి.సూర్యప్రకాశరావు 73 మందికి వైద్య సేవలందించారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, పావని, సూపర్‌వైజర్లు ఎ.పీటర్ డానియేల్, జోస్పిన్ రాణి, ఏఎన్ఎం నీరజ, మార్తమ్మ, డీఈఓ రవితేజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు నమోదును ముమ్మరం చేయాలి



నకరికల్లు: ఓటు నమోదు ప్రక్రియను ముమ్మరం చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న ఓటరు నమోదు దినోత్సవం నిర్వహించాలన్నారు. 6బీ దరఖాస్తు ద్వారా ఓటుకు ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

అందుకూరు(క్రోసూరు): అందుకూరు గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాల విద్యార్థులకు శనివారం వివిధ పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. హెచ్ఎం ఎ.కృష్ణంరాజు, సైన్సు, సోషల్ ఉపాధ్యాయులు తిరుమల రెడ్డి, గోవిందరెడ్డి తదితరులతో పంటలను పరిశీలించారు. ఆహార, వాణిజ్య, ఉద్యాన పంటలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేల స్వభావం, వాతవరణం అనుకూలత, సాగు సమయం, దిగుబడి, ఎరువుల వినియోగం తదితరాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, సాయిబాబు, లక్ష్మీ, వెంకట్రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలి

అచ్చంపేట: సేంద్రియ వ్యవసాయాన్ని రైతులు చేపట్టాలని సర్పంచ్ పెద్దపుల్లారావు అన్నారు. మండలంలోని చల్లగరిగలో డీబీఆర్సీ (దళిత బహుజన రీసోర్స్ సెంటర్) ఆధ్వర్యంలో శనివారం జరిగిన రైతు అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డీబీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు ప్రోత్సహించడానికి రుణంగా రూ.50వేలు ఇస్తుందని తెలిపారు. ఇందులో రూ.10వేలు రాయితీపోను.. మిగిలిన రూ.40వేలు విడతలవారీగా తిరిగి చెల్లించవలసి ఉంటుందని చెప్పారు. డీబీఆర్సీ మండల అధ్యక్షుడు సందెపోగు అశోక్, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సాగర్, వీఆర్ఏ యాంపొంగు సత్యం, యాంపొంగు రవి, మస్తాన్, స్వామి, జార్జి, అచ్చారావు, సంసోను, సాంబయ్య పాల్గొన్నారు.

చేసిన సాయం చెబుతున్నాం..
సమస్యలు పరిష్కరిస్తున్నాం

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: పేదలకు చేసిన సాయాన్ని వివరించి.. వారి సమస్యలు పరిష్కరిస్తున్నామని పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు పేర్కొన్నారు. అమరావతిలోని 2వ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. యాదవపాలెంలో స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే శంకరరావు దృష్టికి తీసుకురావటంతో అయన వెంటనే తన వెంట ఉన్న అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు కావాలని కొందరు కోరగా.. రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి తగు సూచనలు చేశారు. యాదవపాలెం, విజయవాడ రోడ్డు, మద్దూరుడౌన్ సెంటర్‌లో ఎమ్మెల్యే ప్రతి గడపకు తిరిగారు. ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు మాయమాటలు చెప్పి ప్రజలను మభ్యపెడితే.. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికి సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి అశీర్వదించా ఆయన ప్రజలను కోరారు. సీఎం జగన్‌కు ప్రజల్లో ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తమ అనుకూల మీడియాలో బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ అసత్య ఆరోపణలను ప్రజలు తిప్పికొట్టి ప్రతిపక్షాలకు బుద్ధి చెపడం ఖాయమన్నారు.

రూ.21.4.కోట్లతో సంక్షేమాభివృద్ధి

అమరావతిలోని 2వ సచివాలయం పరిధిలో రూ.18.21కోట్ల సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. వైఎస్సార్ అసరా, వైఎస్సార్ పింఛను, రైతుభరోసా ఇలా అనేక పథకాల ద్వారా ప్రజలకు లబ్ది చేకూరిందన్నారు. అలాగే రూ.3.19కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 404 మందికి రూ.14కోట్లతో ఇళ్ల స్థలాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు, మండలాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ పాలపర్తి రాజేశ్వరి, ఉప సర్పంచ్ నిమ్మా విజయసాగర్‌బాబు, ఎంపీటీసీ అలా సామ్రాజ్యం, జడ్పీ కో-అప్షన్ సభ్యుడు షేక్ హమ్మీ, నాయకులు నంబూరు బాబురావు, మంగిశెట్టి కోటేశ్వరరావు, అలా లక్ష్మీనారాయణ, నందూరి కరుణకుమార్, శివరామకృష్ణ, పి.రోశిబాబు, నంబూరు బాబురావు, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, భవిరిశెట్టి హనుమంతరావు, చిల్కా సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

33 పైసల వడ్డీకే వ్యవసాయ రుణాలు

సత్తెనపల్లి: రైతులకు సాగు నిమిత్తం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే అతి తక్కువ 33 పైసల వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీవీ శ్రీనివాస్ పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎస్‌బీఐ పెద్దపీఠ వేస్తుందని, అందులో భాగంగా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రైతులకు ఎటువంటి హామీ లేకుండా 33 పైసల వడ్డీతో రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తీసుకున్న రుణాలు ఏడాది లోపు సక్రమంగా చెల్లిస్తే.. రెండవ సంవత్సరం అదే వడ్డీతో రుణాలను పెంచి ఇస్తామన్నారు. ట్రాక్టర్లు, వరి కోత మిషన్లు 50 పైసలు వడ్డీతో రైతులకు ఎటువంటి హామీ లేకుండా ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు రూ. 20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి కూడా రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. సత్తెనపల్లి మెయిన్ బ్రాంచ్ మేనేజర్ ఎస్‌టీపీవీ రంగరాజన్ మాట్లాడుతూ సత్తెనపల్లి బ్రాంచ్, గాంధీ బొమ్మల సెంటర్ బ్రాంచ్, అబ్బూరు బ్రాంచ్ ల పరిధిలో రైతులకు, డ్వాక్రా గ్రూప్ మహిళలకు కలిపి వారం క్రితమే రూ. 3 కోట్లు రుణాలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న రుణాలపై రాంబాబు కళాజాత బృందం సభ్యులు మాగులూరి రాంబాబు, పులిమెల భాస్కరరావులు పాటలు, నాటికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు కె.అరుణ్ కుమార్, జేసీహెచ్ మల్లిఖార్జున్, సర్పంచ్ గుడిపూడి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు లగడపాటి గజానన, గుంటుపల్లి రామకోటయ్య, తూమాటి రోశయ్య, గుంటూరు శ్రీరామ కృష్ణారెడ్డి, వీవో ఏలు శ్రీదేవి, జ్యోత్స్న, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామానికి చెందిన కంభంపాటి మరియదాసు ఇటీవల మృతి చెందగా అతని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం డాక్టర్ వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు శనివారం ఉపసర్పంచ్ భవనం రమణారెడ్డి అందజేశారు. పేదల కోసం వైఎస్సార్ బీమా పథకం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పీవీ కోటేశ్వరరావు, దొండేటి కోటిరెడ్డి, ఏరువ శివారెడ్డి, కార్యదర్శి జి.రామకోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

సత్తెనపల్లి: కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు పోలీస్ అధికారులు శనివారం పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సత్తెనపల్లి మండలం కంటెపూడి సమీపంలోని నలంద ఇంజినీరింగ్ కళాశాల సెంటర్‌లో మూడు బ్లాక్‌లలో 763 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు పరీక్ష జరగనుంది. అరగంట ముందుగా కేంద్రానికి అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకు రావాలని అధికారులు చెప్పున్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ నేతృత్వంలో సత్తెనపల్లి రూరల్ సీఐ రామిశెట్టి ఉమేష్ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు.

నేడు సత్తెనపల్లిలో ‘స్వర నీరాజనం’

సత్తెనపల్లి: గాన గంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 49వ వర్ధంతి సందర్భంగా మజీర మెలోడీస్ ఆర్కెస్ట్రా, సుశీల్ మీడియా ఎంటర్ టైన్మెంట్ సంయుక్త నిర్వహణలో పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద స్వరనీరాజనం(సంగీత విభావరి) జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొఠారి రంజిత్ కుమార్ నిర్వహణలో ఘంటసాల, సూపర్ స్టార్ కృష్ణ మధుర గీతాలను సాయంత్రం గాయకులు ఆలపించనున్నట్లు తెలిపారు. గుంటూరు కళాదర్బార్ వ్యవస్థాపకుడు పొత్తూరి రంగారావు, సత్తెనపల్లి రంగస్థలం నటుడు ముట్టే రాంబాబుకు ఆత్మీయ సత్కారం జరుగుతుందన్నారు. గాయన,ఈ గాయకులు జె.చంద్రతేజ, శైలజ, బెల్లంకొండ భారతి, ఎస్ సుఖి, స్నేహ శ్రీ సుశీల్ కుమార్, కొఠారి రంజిత్ కుమార్, అంజలి కోటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కళాకారులు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

ప్లాస్టిక్ ఫ్లెక్సీలకు చెక్..!

- ఫ్లెక్సీల ప్రింటింగ్, వినియోగంపై నిషేధం
- ఈ నెల 26 నుంచి పక్కాగా అమలు
- నిబంధనల అతిక్రమిస్తే అపరాధ రుసుం



యజమానులకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ షమ్మి తదితరులు

సత్తెనపల్లి: ప్లాస్టిక్ ఫ్లెక్సీల సంస్కృతికి అధికారులు చెక్ పెట్టనున్నారు. ఈ నెల 26 నుంచి ఫ్లెక్సీలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా.. ఈ మేరకు డివిజన్ కేంద్రంలో సత్తెనపల్లి మున్సిపల్ యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. ఫ్లెక్సీలు ప్రింట్ చేసినా, వినియోగించినా చదరపు అడుగుకు వంద రూపాయలు చొప్పున అపరాధ రుసుం విధించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే తయారీదారులకు అవగాహన కల్పించారు. మరోమారు మున్సిపల్ కార్యాలయంలో ఫ్లెక్సీ యూనిట్ల యజమానులతో శనివారం మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ, టీపీఎస్ రాఘవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి సమావేశం నిర్వహించారు. ఫ్లెక్సీలు తయారీ దుకాణాలు పట్టణంలో ఆరు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్లాస్టిక్, పాలిథిన్‌తో ఫ్లెక్సీల తయారీని పూర్తిగా నిలిపివేయాలని తయారిదారులకు సూచించారు. ఇక పై క్లాత్, టెర్లిన్ పై ముద్రించిన ప్రకటనలు మాత్రమే వినియోగించాల్సి ఉంటుందని వారికి తెలిపారు.

ఫ్లెక్సీలు ముద్రించినా, వినియోగించినా చర్యలు తప్పవు

ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం ఈ నెల 26వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ తెలిపారు. పట్టణంలో ఫ్లెక్సీలు ముద్రించకూడదని, వినియోగించకూడదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలు అతి క్రమించి ముద్రించినా, వినియోగించినా అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఈ వ్యాపారంపై ఆధారపడిన వారికి ప్రత్యేక మార్గాలు చూపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ఏకాగ్రతతో వాహనాలు నడపాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ, పక్కన ఎంవీఐ రాంబాబు తదితరులు

సత్తెనపల్లి: ఏకాగ్రతతో వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు నియంత్రించవచ్చునని పిడుగు రాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర రాంబాబు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లు, యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ రాంబాబు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణనష్టం జరగకుండా నివారించడమే రోడ్డు భద్రత వారోత్సవాల ప్రధానోద్దేశ్యమన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులను విస్తరించడం, రోడ్లకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణం వంటి ఎన్నో చర్యలు చేపడుతోందన్నారు. ఆటో డ్రైవర్లు వ్యక్తిగత క్రమశిక్షణ పాటించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, వాహనం నడుపుతున్నపుడు సెల్ ఫోన్ మాట్లాడం వంటివి చేయకూడదన్నారు. అపుడే ప్రమాదాలు నివారించడం, తగ్గించడం సాధ్యమవుతుందన్నారు. సదస్సులో పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, ఎస్ఐలు అమినుద్దీన్, రఘుపతి మాట్లాడారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీ సుదర్శన హోమం



అమరావతి: మల్లాది గ్రామంలో స్వయంభూగా వటవృక్షాంతర్గత వెంకటేశ్వరుని 46వ వార్షిక కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం లక్ష్మీసుదర్శనహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయ అర్చకస్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రాతఃకాల అర్చన నిర్వహించారు. స్వామి వారికి పంచసూక్తాయుత పంచామృత స్నపన చేశారు. అనంతరం భక్తులచే తులసీదళాలతో, పూలమాలలతో స్వామివారికి విశేషాలంకారం గావించి, భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయం ఎదురుగా ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి వైఖానస ఆగమశాస్త్రానుసారం పరుచూరి శ్రీని వాసాచార్యుల నేతృత్వంలో పుణ్యాహవాచన, నవ గ్రహ మండపారాధన, అనంతరం లక్ష్మీసుదర్శనహోమం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

పీహెచ్‌సీలో అభివృద్ధి పనుల పరిశీలన



క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పెరుమాళ్లపల్లి కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం సందర్శించారు. పీహెచ్‌సీలో నాడు-నేడు పథకం ద్వారా రూ.50 లక్షల నిధులతో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. సమావేశం గది, సీసీరోడ్లు, ప్రధాన రహదారి గేటు, పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బాల అంకమ్మబాయి ఆసుపత్రి చుట్టూ గార్డెనింగ్ చేయాల్సి ఉందని వారికి తెలిపారు. అదనపు గది కావాలని వివరించారు. సౌకర్యాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గార్లపాటిదాసు, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, మేదర రోశయ్య, సీహెచ్‌వో సాంబశివరావు, యూడీసీ జానీబాషా, ల్యాబ్ టెక్నీషియన్ ప్రభాకర్, స్టాఫ్ నర్సు అంజమ్మ తదతరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి

క్రోసూరు: మండలంలోని రైతులు ఈ-కేవైసీ (వేలిముద్రలు) వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని ఏవో వేణుగోపాల్ శనివారం తెలిపారు. మండలంలో ఇంకా 2,025 మంది రైతులు ఈ-కేవైసీ చేయించుకోలేదని తెలిపారు. ఈ -కేవైసీ కాకపోతే.. ప్రధాన మంత్రి కిసాన్ పథకం డబ్బులు రైతుల ఖాతాల్లో జమకావడం జరగదని తెలిపారు. ఈ నెల 25 లోపు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

నెలాఖరు లోపు ఈ-పంట నమోదు పూర్తి చేయాలి



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): నెలాఖరు లోపు ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ఫసల్ బీమా యోజన లో భాగంగా శనివారం వరి పంటకోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన చింకా నాగరాజుకు చెందిన వరి పొలంలో 5X5 సైజ్ విస్తీర్ణంలో పంట కోసి నూర్పించగా 18.800 కేజీలు వచ్చినట్లు తెలిపారు. ఎకరానికి సుమారు 40బస్తాల దిగుబడి(1బస్తా 75కేజీలు) వచ్చిందని వివరించారు. అలాగే మరో రైతు కు చెందిన పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 15.760 కేజీలు వచ్చాయి. వివరాలను సీసీఈ యాప్‌లో నమోదు చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ, వీఏఏ శైలజ, రైతులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం.. ప్రభుత్వ ధ్యేయం

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి గీతాంజలి



కందిపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ గీతాంజలి

బెల్లంకొండ: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పల్నాడు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ గీతాంజలి తెలిపారు. శనివారం మండలంలోని కందిపాడు గ్రామం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఇమ్యూనేజేషన్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. గ్రామాలలో ఫ్యామిలీ డాక్టర్ ఇంటి ముంగిటకు రావడంతో రోగులలో ఆత్మ విశ్వాసం కలుగుతుందని తెలిపారు. సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని, హైరిస్క్ గర్భిణులకు కాన్పు అయ్యే వరకూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వైద్యాధికారి సుందర్, ఎంపీహెచ్‌ఈవో శిఖా శ్యాంసన్, శ్రీనివాసరావు, రాణి, ఫ్లోరెన్స్, పార్వతి, ఏఎన్ఎం అరుణ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ ఎక్కి.. కుటుంబం ఆత్మహత్యాయత్నం

- టవర్ పైనే దంపతులతో పాటు ముగ్గురు పిల్లలు
- ఓ కేసు విషయంలో తమకు న్యాయం జరగలేదన్న బాధితులు
- న్యాయం చేస్తామని.. కిందకు దించిన పోలీసులు



టవర్ పైన ఉన్న జ్యోజి, అరుణ కృప దంపతులు, పిల్లలు

సత్తెనపల్లి: సెల్ టవర్ ఎక్కి ఓ కుటుంబం ఆత్మహత్యకు యత్నించిన ఘటన సత్తెనపల్లి పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. దీంతో ఒక్కసారిగా పట్టణంలో కలకలం రేగింది. ఓ కేసు విషయంలో తమకు న్యాయం జరగలేదని, ఆత్మహత్య చేసుకుంటామంటూ తమ ముగ్గురు పిల్లలను దంపతులు సెల్‌టవర్‌పైకి తీసుకెళ్లి ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న స్థానిక డీఎస్పీ బాధితులతో మాట్లాడి, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు కిందకు దిగారు.

వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 31వ వార్డుకు చెందిన మల్లవరపు జ్యోజి, అరుణ కృప దంపతులు తమ ముగ్గురు బిడ్డలైన హోసన్న, శేషుబాబు, రేవతీలను తీసుకొని పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న సెల్‌ఫోన్ టవర్‌ను శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఎక్కారు. ఈ విషయం తెలుసుకున్న సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, ఎస్ఐలు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంటన్నర పైగా ఐదుగురు టవర్ పైనే ఉన్నారు. పలుమార్లు సెల్‌ఫోన్‌లో పోలీసులు వారితో సంప్రదింపులు జరిపారు. మరో వైపు దళిత నాయకుడు రవితో కూడా మాట్లాడించి వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో టవర్ పై నుంచి వారు కిందకు దిగారు. కుటుంబ సభ్యులకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో...పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రధాన రహదారి పక్కనే కావడంతో పెద్ద ఎత్తున జనం గుమిగూడారు.

టవర్ ఎక్కడానికి కారణమేమిటంటే

మల్లవరపు జ్యోజి రైస్‌మిల్లు ఆపరేటర్‌గా, ఆతని భార్య అరుణ కృప కూలీగా పని చేస్తు జీవనం సాగిస్తున్నారు. కోవిడ్ సమయంలో పనులు లేక పోవడంతో అడపాదడపా దొరికే పనులకు వెళ్లారు. ఈ క్రమంలో ఈ నెల 3న అరుణకృప సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డులోని వల్లభ రైస్‌మిలుల్లో పని కోసం వెళ్లింది. ఈ నెల 7న గోతాలు తీసే విషయంలో సూపర్‌వైజర్‌కు, ఆమెకు మధ్య గొడవ జరిగింది. అనంతరం మిల్లు యజమాని తల్లం సతీష్ ఆమెను పనిలోకి రావద్దని చెప్పాడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో తనను కులం పేరుతో బూతులు తిట్టాడని అరుణ కృప తన భర్త జ్యోజికి చెప్పుకొని విలపించింది. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తుండటంతో ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ విచారణకు ఆదేశాలు ఇవ్వగా సత్తెనపల్లి రూరల్ సీఐ ఆర్.ఉమేష్ విచారణ చేసి వాగ్మూలాలను రికార్డు చేశారు. కులం పేరుతో దూషించిన ప్రస్తావన ఎక్కడా లేదని.. విచారణలో తేలినట్లు తెలింది. ఈ వ్యవహారంలో తమకు న్యాయం జరగడం లేదని మనస్థాపం చెందిన ఆ దంపతులు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు సెల్‌ఫోన్ టవర్ ఎక్కారు.

కేసు నమోదు చేసి, న్యాయం చేస్తాం

మల్లవరపు జ్యోజి, అరుణ కృప దంపతులను కులం పేరుతో దూషించినట్లు పది రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తమకు న్యాయం జరగలేదని వారు ఆత్మహత్యకు యత్నించారని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ చెప్పారు. అరుణ కృపను కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేస్తామన్నారు. నిందితుడిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీని వెనుక ఉన్న అసలు కారణాలు, రాజకీయ కోణం పై కూడా పోలీసులు విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది.